డేంజర్ మలుపులు

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వేడుకోలు

గరిడేపల్లి : మండల కేంద్రం నుంచి దురాజ్‌పల్లి వెళ్లే రహదారిలో మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మర్రికుంట శివారు నుంచి గడ్డిపల్లి శివారు వరకు ఆరు చోట్ల గల మూలమలుపులుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పోనుగోడు దాటిన తర్వాత మర్రికుంట శివారులో వరుసగా రెండు మూలమలుపులు, మర్రికుంట వంతెన వద్ద, గడ్డిపల్లి గ్రామ శివారులో మూలమలుపుల వద్ద కనీసం సూచిక బోర్డులు కూడా లేవు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి వచ్చిపోయే వాహనాలు కనిపించడం లేదు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వేగంగా వస్తుండడంతో రాత్రి సమయంలో మూలమలుపుల వద్ద వాహనాలు కనపడక ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అయితే మర్రికుంట వద్ద గల సాగర్ ప్రధాన ఎడమ కాల్వపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో మూలమలుపును సరిచేస్తూ వంతెన నిర్మించేలా ప్రణాళిక రూపొందించి అధికారులు సర్వే కూడా చేశారు. కానీ వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఆ మూలమలుపు అలానే ఉండిపోయింది. అధికారులు స్పందించి ప్రమాదకర మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


మర్రికుంట వద్ద ప్రమాదకరంగా మూలమలుపు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మూలమలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాల జరుగుతున్నాయి. మూలమలుపుల వద్ద రోడ్డును ఇరువైపులా కంపచెట్లు కమ్మేయడంతో వచ్చే వాహనాలు కనిపించడం లేదు. సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సూచికబోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి కంపచెట్లను తొలగించాలి.

– కోటమర్తి సందీప్ గడ్డిపల్లి


పొనుగోడు శివారులో..


మర్రికుంట పరిధిలోని సాగర్ ప్రధాన ఎడమ కాల్వ వంతెన వద్ద..

క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : మండలంలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొంది ఇప్పటివరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు ఈ నెల 13 లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టాదారు పాసు పుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో విస్తరణాధికారులను సంప్రదించాలని తెలిపారు. 1966 నుంచి 2007 మధ్యలో జన్మించిన రైతులు రైతు బీమాకు అర్హులని ఆయన తెలిపారు.

హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐని నియమించాలి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐని నియమించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ కోరారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రంలో చాలా కేసులు పెండింగ్‌లో ఉండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గంగమ్మ తల్లి జాతర, పట్టణంలో రెండు రోజులపాటు వైభవంగా జరిగే ముత్యాలమ్మ జాతరలు, గణేశ్ నవరాత్ర ఉత్సవాలు ఉన్నందున పోలీస్ బందోబస్తు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి ఉత్తమ్, ఉన్నతాధికారులు దృష్టి సారించి ఎస్‌ఐని నియమించాలని ఆయన కోరారు.

పాపన్నగౌడ్ జయంతిని జయప్రదం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జైగౌడ్ సంఘం నాయకులు

మఠంపల్లి : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 10న నిర్వహించబోయే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని జైగౌడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేసగాని నాగేశ్వరరావుగౌడ్ కోరారు. శనివారం మండలంలోని బక్కమంతులగూడెంలో పాపన్నగౌడ్ జయంతి వేడుకల పోస్టర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వల్లపుదాస్ ఎల్లయ్యగౌడ్, వీరయ్యగౌడ్, సైదులుగౌడ్, భిక్షంగౌడ్, జస్వంత్, సంతోష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణకు అధికారులు సూచనలివ్వాలి


రామాపురంలో కలుపు మొక్కలు చూపిస్తున్న రైతులు

నడిగూడెం : సాగర్ ఆయకట్టులో సాగు చేసిన వరి పంటలో కలుపు అదుపులోకి రావడం లేదని పలువురు రైతులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ.. కలుపు నివారణకు అనేక మందులు పిచికారీ చేసినా నివారణ కావడం లేదన్నారు. సంబంధిత వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామంలో పర్యటించి రైతులకు సూచనలివ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బూతుకూరి వెంకటరెడ్డి, మారిశెట్టి నర్సింహారావు, ఈద శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, సింగారెడ్డి పుల్లారెడ్డి, అటూరి వెంకటరెడ్డి, మెండె రామారావు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

నడిగూడెం : నులిపురుగుల నిర్మూలనతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి అన్నారు. ఈ నెల 11న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించనున్నట్లు తెలిపారు. నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రత్యేక అధికారి విజయ, ఏఎన్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు అనిత, మౌనిక, ఖనీఫ్, ఫాతిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నడిగూడెం : మోతె మండలం ఉర్లుగొండ గ్రామ పరిధిలోని పాలేరు వాగు నుంచి నడిగూడెం మండల కేంద్రానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ గందమళ్ల అజయ్‌కుమార్ తెలిపారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ భూక్యా మోహన్‌పై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వెలిదండలో ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

గరిడేపల్లి : భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50 శాతం విధించడాన్ని ఖండిస్తూ శనివారం గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు మేకల కనకరావు మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం తాను చెప్పినట్లు వినాలని, భారతదేశం కూడా రష్యాతో చేసుకున్న చమురు దిగుమతి ఒప్పందం విరమించుకొని తమ దేశం నుంచి దిగుమతి చేసుకోవాలని చేస్తున్న ట్రంప్ డిమాండ్‌ను ఖండించాలన్నారు. ట్రంప్ ఈ విధంగా షరతులు పెట్టడం సరైంది కాదన్నారు. అదేవిధంగా దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న బహుళజాతి కంపెనీలు కూడా భారతదేశం నుంచి తరలివెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పెద్ద సాంబయ్య, చిట్టి అంజయ్య, గుండు నాగేశ్వర్‌రావు, పర్వతాలు, నవీన్, శ్రీను, సుందరయ్య, నరేష్, ముత్తయ్య, వెంపటి, సూర్యం, లక్ష్మయ్య, వెంకటి, మల్లయ్య, భిక్షం, సైదులు తదితరులు ఉన్నారు.


ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

డబుల్ రోడ్డు కల నెరవేరిన వేళ

చిలుకూరు : మండలంలో బేతవోలు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై చిలుకూరులోని బేతవోలు క్రాస్ రోడ్డు నుంచి బేతవోలు వరకు గల 8 కిలోమీటర్ల సింగల్ లైన్ రోడ్డును ఆర్‌అండ్‌బీ నిధులు రూ.16 కోట్లతో డబుల్ రోడ్డుగా మార్చారు. ఈ రోడ్డు పూర్తికావడంతో బేతవోలు, జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, పోలేనిగూడెం తదితర గ్రామాలకు మార్గం సుగమమైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల డబుల్ రోడ్డు కల నెరవేరిందని అంటున్నారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.


పూర్తయిన బేతవోలు డబుల్ రోడ్డు

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం ముకుందాపురం గ్రామానికి ఆర్‌ఎంపీ చిరందాస్ ఉపేంద్రాచారి -మంజుల దంపతుల కుమార్తె నిర్మల పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమం వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి, విద్యావేత్త పందిరి నాగిరెడ్డి, సేకు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మండలంలోని స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్ -రాణి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.


వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు


శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మురుగు పారే దారేది !

- డ్రెయినేజీ చివర అడ్డుకట్ట
- వీధుల్లో పారుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చిలుకూరు : చిలుకూరు మండలంలోని జానకీనగర్ గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీరు పారకుండా డ్రెయినేజిని కొందరు పూడ్చి వేయడంతో గ్రామంలోని ప్రధాన రహదారిలో మురుగు ప్రవహిస్తోంది. అయితే గ్రామ శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మురుగు కాల్వకు చివర కల్వర్టు ఉంది. గ్రామంలోని నీరు డ్రెయినేజీ నుంచి ఆ కల్వర్టు గుండా పంట కాలువలోకి వెళ్లేది. కానీ పక్కన పంట పొలం ఉన్న రైతు పంట కాలువను ఆక్రమించి సాగు చేసుకున్నాడు. అంతేకాకుండా మురుగు నీరు రాకుండా కల్వర్టు వద మట్టితో అడ్డుకట్ట వేశాడు. దీంతో మురుగు నీరు వెళ్లే మార్గం లేక వీధుల్లో నిలుస్తున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన విపరీతంగా వెదజల్లుతుండడంతో సమీప ఇళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో, మురుగు కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గతేడాది ఈ గ్రామంలో వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలి గ్రామ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దాదాపుగా నెల రోజుల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇప్పుడు కూడా దోమలు వ్యాప్తి చెందితే ప్రస్తుత వర్షాకాలంలో విషజ్వరాలు వస్తాయని గ్రామస్థులు అంటున్నారు. ఈ విషయంపై కార్యదర్శి రజితను వివరణ కోరగా డ్రెయినేజీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.


జానకీనగర్‌లో ప్రధాన వీధిలో నిలిచిన మురుగునీరు


ముగురునీరు పారకుండా అడ్డుగా పోసిన మట్టి

తీజ్ సంబరం


తీజ్ వేడుకలో పాల్గొన్న గిరిజనులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని మంగళితండాలో శనివారం తీజ్ వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు పూజలు చేశారు. తొమ్మిది రోజులు నీరు పోసి పూజించిన గోదుమల మొలకల బుట్టలను గిరిజన యువతులు తలపై పెట్టుకొని ఊరేగింపుగా నృత్యాలు చేస్తూ తీసుకెళ్లి నీటిలో వదిలారు.

ఘనంగా సంతోషిమాత జన్మదిన వేడుకలు

సూర్యాపేట : పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీసంతోషిమాత జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణ శర్మ అమ్మవారికి తెల్లవారు జామున 108 కలశములతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు బ్రాహ్మాండ్లపల్లి మనోహర్ గుప్త దంపతులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ ఉత్సవం నిర్వహించి భక్తుల సహకారంతో తయారు చేయించిన వెండి గిన్నె, ప్లేట్లు, గ్లాసులు అమ్మవారికి సమర్పించారు. భక్తులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకున్నారు. సంతోషిమాతకు ఉద్యాపన వ్రతం, ఒడి బియ్యం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. వెన్నెల్లో పారాయనం, నామకరణ మహోత్సవం, పవలింపు సేవ కార్యక్రమాలు నిర్వహించి మూడు రోజులుగా జరుగుతున్న జన్మదిన వేడుకలను పరిసమాప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పాలవరపు రామమూర్తి, దేవాలయ కమిటీ సభ్యులు పబ్బా ప్రకాశ రావు, దేవరశెట్టి సోమయ్య, బెలిదె అశోక్, మహంకాళి ఉపేందర్, గోపారపు రాజు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, దేవి దత్తు, సంతోష్, రవిశంకర్, శివ ప్రసాద్, తోట లక్ష్మీనరసింహారావు, దేవాలయ సహాయ అర్చకులు భట్టారం వంశీకృష్ణశర్మ, అశోక్ మిశ్రా, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేసిన కొప్పుల వేణారెడ్డి..

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి శ్రీ సంతోషిమాత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు బైరు శైలేందర్, రాపర్తి శ్రీనివాస్, గండూరి రమేష్, అనంతుల యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి

అర్వపల్లి : సైబర్ మోసాలకు గురయితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అర్వపల్లి ఏఎస్‌ఐ రామకోటి తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణపై శనివారం అర్వపల్లిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా అపరిచితులు ఫోన్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా, మెసేజీల ద్వారా వెబ్‌లింక్‌లు, యాప్స్ పంపితే ఏ విధంగా కూడా స్పందించకూడదని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సతీష్, నాగయ్య, రవి, అశోక్, స్థానికులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం


అయ్యప్పస్వామిని అలంకరిస్తున్న అర్చకుడు


పూజలో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు వెంకటరమణశాస్త్రి వేద మంత్రోత్సవాల మధ్య స్వామివారికి అభిషేకం చేశారు. హోమాలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం కృష్ణారెడ్డి, సంధ్య దంపతులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, నాగండ్ల శ్రీధర్, కట్ట గణేష్‌రెడ్డి, చిన సీతారాంరెడ్డి, వీరయ్య, దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరమణారెడ్డి, జంగయ్య, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్ రెడ్డి, పాపయ్య, రాంబాబు తదితరులు ఉన్నారు.

కనులపండువగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాస్, రాణి దంపతులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారి జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు కందాళ శ్రీనివాసాచార్యులు, ప్రశాంత్‌చార్యులు కనుల పండువగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్ -రాణి దంపతులు పీటలపై కూర్చొని కల్యాణాన్ని నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జంధ్యాల పూర్ణిమ వేడుకలు

కోదాడరూరల్ : పట్టణంలో శనివారం జంధ్యాల పూర్ణిమ వేడుకలను కోదాడ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీల కులదైవం మార్కండేయ మహామునికి, భావన రుషి, బద్రావతి స్వాములకు పండితులు విశిష్ట పూజలు నిర్వహించారు. యజ్ఞోపవీత కార్యక్రమాన్ని కనుల పండువగా జరిపారు. ఏడాదికి ఓసారి వచ్చే శ్రావణ పూర్ణిమకు ఎంతో విశిష్టత ఉందని ఆ రోజున పాత జంధ్యాలను తొలగించి నూతన జంధ్యాలను ధరించనున్నట్లు పలువురు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గోలి నాగరాజు, శ్రీనివాస్, గిరిప్రసాద్, గోపాల్, నరసింహారావు, చంద్రం, రామకృష్ణ, యతిరాజం తదితరులు ఉన్నారు.


వేడుకలో పాల్గొన్న పద్మశాలిలు

మట్టపల్లిలో నారసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో వైభవంగా ఊరేగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు రామా చార్యులు,పద్మనాభా చార్యులు లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహర్షి విఖనస జయంతి

అనంతరం ఆలయంలో మహర్షి విఖనస జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విఖనసాచార్యుల విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ప్రత్యేక పూజలు చేశారు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి పుత్రుడైన విఖనసాచార్యులు పుట్టినరోజు కావడంతో ప్రత్యేక అర్చనలు, పూజలు చేశామని అర్చకులు తెలిపారు.


ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, భక్తులు


విఖనసాచార్యులకు పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు


మునగాల : రాఖీ కట్టిన అనంతరం సోదరుడిని దీవిస్తున్న సోదరి


చింతలపాలెం మండలం దొండపాడులో వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు


నడిగూడెం : సోదరుడికి రాఖీ కడుతున్న సోదరీమణులు

గ్రామాల్లో వీధి కుక్కల స్వైరవిహారం

- వీధుల్లో వచ్చిపోయే వారిపై దాడి చేస్తున్న కుక్కలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

మేళ్లచెరువు : మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ వచ్చీపోయే వారి వెంట పడుతూ గాయపరుస్తున్నాయి. దీంతో వీధుల్లోకి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు తోడులేకుండా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. కుక్కల బెడదను నివారించాలని పంచాయతీ కార్యదర్శులకు, మండల అధికారులకు అనేకసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే గ్రామాల్లో రోడ్ల వెంట వ్యర్థాలు పడవేస్తుండడంతో కుక్కల అవి తింటూ గుంపులుగా తిరుగుతున్నాయి. ఇటీవల కందిబండ గ్రామంలో డెక్కం మధు అనే వ్యక్తి రాత్రి సమయంలో తమ ఇంటి వద్ద గాయపడిన కుక్కను కాపాడబోయాడు. ఆ సమయంలో కుక్క అతడిని గాయపరచడంతో 20 రోజుల అనంతరం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. అదేవిధంగా మండలంలోని వెల్లటూరు, హేమ్లాతండా, జగ్గుతండా గ్రామాల్లో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఇద్దరు వ్యక్తులను, గేదెలపై దాడి చేయడంతో గ్రామాల్లోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల చింతలపాలెం మండలంలోని గాంధీనగర్ తండాలో ఏడాది పాపను కుక్క గాయపరచడంతో చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కావున కుక్కల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మేళ్లచెరువులో గుంపుగా తిరుగుతున్న కుక్కలు

వ్యాస రచన పోటీలు

సూర్యాపేట : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ పీఓ ఎస్.శృతి పాల్గొని విద్యార్థులకు ఆదివాసీ దినోత్సవం ప్రాముఖ్యత, ప్రత్యేకతను వివరించారు. అనంతరం ఇన్‌చార్జ్ వైస్ ప్రిన్సిపాల్ జి.సుష్మ మాట్లాడారు. ఆదివాసీలు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కు సంబంధించిన కోర్సుల మీద పట్టు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని కోరుకున్న రంగంలో రాణించాలని తెలిపారు.